సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం | 12 | ఏప్రిల్ | 2024



సిరులతల్లికి పంచామృతాభిషేకం 8లో
విశాఖ కనకమహాలక్ష్మి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.



వైభవంగా ఆర్జిత సేవలు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. 8లో



ఘనంగా లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు 8లో
దేవీపురంలోని రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

అడ్డగోలు గీత

ప్రచారానికి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా కూటమి నేతలకు పట్టడం లేదు. అనుమతి గడువు ముగిసిన రెండు వాహనాలను గురువారం అరకు ఎంపీ బీజేపీ అభ్యర్థి రోడ్‌షోలో అధికారులు గుర్తించారు.

- నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఎన్నికల ప్రచారం
- యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- పార్టీ కండువాలతో గుడిలో పూజలు
- అనుమతి లేని వాహనాలను రోడ్‌షోలో వినియోగం
- రెండింటిని గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్
- మిగతా వాహనాల అనుమతులపై ఆరా
- ధ్రువీకరణ అనంతరం కేసులు: నోడల్ అధికారి వీర కిషోర్



నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అరకు బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి ఎన్నికల ప్రచారం

రంపచోడవరం: అరకు ఎంపీ కూటమి (బీజేపీ) అభ్యర్థి కొత్తపల్లి గీత ఎన్నికల ప్రచారంలో ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. బుధవారం రంపచోడవరం, గంగవరం, అడ్డతీగలలో నిర్వహించిన రోడ్‌షోలో అనుమతులు లేకుండా వాహనాలను వినియోగించినట్టు ఆరోపణలు ఉన్నాయి. గురువారం మారేడుమిల్లిలో ఆమె, రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి నిర్వహించిన రోడ్‌షోలో ఇదే పరిస్థితి నెలకొంది. మారేడుమిల్లిలోని ఏకలవ్య పాఠశాల దగ్గర నుంచి వారు రోడ్‌షో ప్రారంభించారు. మార్గం మధ్యలోని పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన తరువాత వాహనాలను అక్కడ నిలిపి పక్కనే ఉన్న గంగాలమ్మ గుడికి వెళ్లారు. పార్టీ కండువాలతో ఉన్న వారు పూజలు నిర్వహించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ వైక్, వాహనాల వినియోగానికి సంబంధించిన అనుమతులను పరిశీలించారు. అయితే వీటిలో ర్యాలీలో వినియోగించిన వాహనాల్లో కొన్నింటికి మాత్రమే అనుమతి ఉంది. ఈమేరకు అనుమతి లేని వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ నిలిపివేశారు. దీంతో అభ్యర్థులు కొత్తపల్లి గీత, మిరియాల శిరీషాదేవి మారేడుమిల్లి జంక్షన్ నుంచి నడుచుకుంటూ ముందుకు వెళ్లారు. అనుమతులు ఉన్న వాహనాల్లో అక్కడి నుంచి వారు బోదులూరు వైపు వెళ్లిపోయారు. ఎన్నికల ప్రచారంలో యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్న అభ్యర్థి కొత్తపల్లి గీత మీడియా సమావేశంలో అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారంటూ ఆరోపించడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఎన్నికల నోడల్ అధికారి వీర కిషోర్‌ను వివరణ కోరగా రోడ్డుషోలో వినియోగించిన వాహనాల్లో రెండింటికి ఈనెల 10తోనే అనుమతి గడువు ముగిసిందన్నారు. ర్యాలీలో వినియోగించిన మిగతా వాహనాల నంబర్లను పోలీసులు సేకరించారని, వీటికి అనుమతులు ఉన్నదీ లేనిది పరిశీలించి తదనుగుణంగా కేసులు నమోదు చేస్తారన్నారు.

అరకు టీడీపీలో అయోమయం

రెబల్‌గా బరిలో నిలవనున్న దొన్నుదొర, సివేరి అబ్రహం

అరకు టౌన్: టీడీపీలో అసమ్మతి జ్వాలలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే రెబల్ అభ్యర్థులుగా పోటీ చేస్తామని పాడేరు అసెంబ్లీకి చెందిన గిడ్డి ఈశ్వరి, అరకు అసెంబ్లీకి చెందిన సివేరి అబ్రహం ప్రకటించడం తెలిసిందే. టీడీపీకి చెందిన సీనియర్ నేత సియ్యారి దొన్నుదొర కూడా అరకు అసెంబ్లీకి రెబల్‌గా పోటీచేస్తానని గురువారం ప్రకటించారు. దీంతో ఇదే అసెంబ్లీకి టీడీపీ నుంచి తిరుగుబాటు అభ్యర్థులుగా ఇద్దరు బరిలో నిలవనుండటంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. తొలుత అరకు అభ్యర్థిగా ఆయనను ప్రకటించిన టీడీపీ అధిష్టానం పొత్తులో భాగంగా ఈ సీటును బీజేపీకి కేటాయించింది. దీంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. పార్టీ టికెట్ కేటాయింపు విషయంలో మరోసారి ఆలోచించాలని గతంలో లోకేష్‌ను కోరారు. అయినప్పటికీ ఎటువంటి మార్పులేకపోవడంతో ఇటీవల తన అనుచరులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. అధిష్టానం చేసిన ద్రోహాన్ని ఆయన వారికి వివరించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారి అభీష్టం మేరకు పోటీచేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. కూటమి తరపున బీజేపీ అభ్యర్థి పోటీచేస్తుండగా టీడీపీ నుంచి రెబల్ అభ్యర్థులుగా దొన్నుదొర, సివేరి అబ్రహం బరిలో నిలవనుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భాస్కరరావు సత్తా

పెదగంట్యాడ (విశాఖ): అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడ మండలం భానోజీతోటకు చెందిన ఉక్కు ఉద్యోగి మర్ల భాస్కరరావు సత్తా చాటారు. షాట్‌పుట్, పవర్‌లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలు సాధించారు. సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 5 వరకూ నేపాల్‌లోని పొఖారాలో గల రంగశాల స్టేడియంలో 9వ అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన మర్ల భాస్కరరావు షాట్‌పుట్‌లో 10.84మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే పవర్ లిఫ్టింగ్ 74కిలోల విభాగంలో 380కిలోల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించారు.



బంగారు పతకాలను అందజేస్తున్న నిర్వాహకులు

న్యూస్‌రీల్

కేంద్రంలో బీజేపీని గద్దె దింపుదాం

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

అరకులోయ రూరల్: ప్రజల హక్కులను నిర్వీర్యానికి కుట్ర చేస్తున్న కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన భవన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రకు అభివృద్ధి ప్రణాళికపై మ్యానిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అపారమైన వనరులు ఉన్నప్పటికీ ఆశించినంతగా అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు పెద్ద కుట్ర చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కుల నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన జనసేన, టీడీపీలు బీజేపీతో జతకట్టి దొంగల అవతారం ఎత్తారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు ఇవి కూడా తోడయ్యాయన్నారు. అందరం ఏకమై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడిద్దామని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తొలగింపు

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మూర్తి శ్రీని ఉద్యోగ విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న కారణంతో ఏసీబీ అధికారులు 2006లో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఆ కేసు కోర్టులో నడుస్తోంది. తాజాగా ఏసీబీ న్యాయ స్థానంలో ఆ కేసు రుజువు కావడంతో ప్రభుత్వం ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


అన్నమాచార్య సంకీర్తన పోటీలకు ఆహ్వానం

దాబాగార్డెన్స్ (విశాఖ): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 19న పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు శృతిలయ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా నాలుగు విభాగాల్లో జరగనున్న అన్నమాచార్య సంకీర్తన పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలిచే భక్తులు పేరు, వయసు, స్కూల్ పేరు, ఆధార్ నంబర్, సెల్ నంబర్ తెలియజేయాలని, వివరాలు వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేస్తామన్నారు. మే 8వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని, వివరాలకు 98498 29297 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టాటా - ఎర్నాకుళం రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మాణం నిమిత్తం ట్రాఫిక్ కం పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ నెల 13వ తేదీన టాటానగర్‌లో ఉదయం 5.15గంటలకు బయల్దేరవలసిన టాటానగర్–ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్ సుమారు 4గంటలు ఆలస్యంగా ఉదయం 9.15గంటలకు బయల్దేరుతున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



ముద్దరాజు మృతదేహం

ఎటపాక: మండలంలోని విస్సాపురంలో బుధవారం వడదెబ్బకు గురై ఉపాధి హామీ పథకం కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన కుంజ ముద్దరాజు (40) మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చిన ముద్దరాజు వాంతులు, విరేచనాలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అతడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం రాత్రి మృతి చెందినట్టు అక్కడి వైద్యులు తెలిపారు. వడదెబ్బ వల్లే ముద్దరాజు మృతి చెందినట్టు ఉపాధి హామీ ఏపీవో రాఘవయ్య తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎన్నికల వేళ.. మరింత నిఘా



పాడేరు: వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



పోలీసుల వాహనాల తనిఖీలను లైవ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

- జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల ఏర్పాటు
- కమిషన్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు
- తనిఖీలపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. సరిహద్దులోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల రోడ్లలో రాకపోకలు సాగించే వాహనాలపైన పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియకు సమయం దగ్గర పడుతుండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక పోలీసు బలగాలు చెక్‌పోస్టులతో పాటు ప్రధాన జంక్షన్లలో మోహరించి తనిఖీలు చేపడుతున్నాయి.

నగదు, మద్యం అక్రమ రవాణాపై దృష్టి

జిల్లాలో అరకు పార్లమెంట్, పాడేరు, రంపచోడవరం, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో నగదు, మద్యం అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

- పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి, అనంతగిరి సమీపంలోని డముకు, ముంచంగిపుట్టు, చింతూరు, డొంకరాయి ప్రాంతాలలోని ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు.
- ఎన్నికల కమిషన్‌తో పాటు పాడేరు కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తూ వెబ్ కెమెరాల వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ బస చేస్తున్న పోలీసు బలగాలు 24 గంటలు వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నాయి. ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లతో పాటు అనుమానిత లోడ్ లారీలు, వ్యాన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తనిఖీల ప్రక్రియ కూడా కెమెరాల ద్వారా రికార్డు చేస్తున్నారు.

సరిహద్దులోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్యం వచ్చే అవకాశం ఉన్నందున దీనిపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

నిరంతరం సమీక్షలు

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలపై కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హాలు వేర్వేరుగా నిరంతరం సమీక్షిస్తున్నారు. పాడేరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వెబ్ కెమెరాల ద్వారా చెక్‌పోస్టుల్లో జరుగుతున్న తనిఖీల ప్రక్రియను కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



పాడేరు: నమాజు చేస్తున్న ముస్లిం సోదరులు



చింతూరు: ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం సోదరులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఘనంగా ఇఫ్తార్ విందు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పండగను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పురాతన మసీదు, జమాత్ మసీదు, గుత్తులపుట్టు, సుండ్రుపుట్టు దర్గా ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇఫ్తార్ విందును నిర్వహించారు.

చింతూరు: చింతూరు మస్జీదే–యాసీన్‌లో భక్తిశ్రద్ధలతో రంజాన్ నమాజును ఆచరించారు. అనంతరం పిల్లలు, పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఇంటి వద్ద రంజాన్ ప్రత్యేక సేమ్యా పాయసాన్ని స్వీకరించారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలో గురువారం ఆమె సిరిగిందలపాడు, గాంధీనగరం, చినభీరంపల్లి, గొట్లగూడెం, జగమెట్లపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె ఇంటింటికీ తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలు కలిసి పోటీచేసినా వైఎస్సార్ కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. పేదల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నది తమ ప్రభుత్వం ఒక్కటేనన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. ఆయనను మళ్లీ సీఎంను చేసేందుకు అందరూ అండగా నిలవాలని కోరారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి



విద్యార్థిని కృష్ణవేణి మృతదేహం

జి.మాడుగుల: మండలంలో నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థి ని అమ్మిడేలు కృష్ణవేణి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. పెదబయలు మండలం బొంగరం పంచాయతీ అమ్మిడేలు గ్రామానికి చెందిన ఆమె ఎనిమిదో తరగతి చదువుతోంది. అమ్మిడేలు గ్రామం నుంచి ఈనెల 8న పాఠశాలకు వచ్చిన ఆమె తల్లి ఉగాది పండగ నిమిత్తం కృష్ణవేణిని పాఠశాల యాజమాన్యం అనుమతితో తీసుకువెళ్లింది. ఈ నెల 10న తీసుకువచ్చి పాఠశాలకు అప్పగించింది. అదేరోజు రాత్రి కృష్ణవేణి పాఠశాల వసతి గృహంలో వాంతులు చేసుకుంది. కాలకృత్యాల నిమిత్తం గురువారం ఉదయం వాష్ రూమ్‌కు వెళుతూ కళ్లుతిరిగి పడిపోయింది. కొద్ది సమయంలోనే ఆమె మృతి చెందినట్టు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

ఏటీడబ్ల్యూవో రజని విచారణ

విద్యార్థిని కృష్ణవేణి మృతి సమాచారం తెలుసుకున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈమేరకు విచారణ అధికారిగా నియమితులైన పాడేరు ఏటీడబ్ల్యూవో రజని విద్యార్థిని మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నుర్మతి ఆశ్రమ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బూడిద మాధవరావు, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్ డిమాండ్ చేశారు. ఈనెల 8న కుటుంబ సభ్యులు పాఠశాల నుంచి విద్యార్థిని కృష్ణవేణిని ఇంటికి తీసుకువెళ్లారని, ఆరోగ్యం కుదుటపపడటంతో పరీక్షలు ఉన్నందున ఈనెల 10న తీసుకువచ్చి అప్పగించారన్నారు. ఈ పరిస్థితుల్లో గురువారం నీరు తాగుతూ పాఠశాలలోనే మృతి చెందిందన్నారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు.

బల్లాట శిబిరంపై దాడి

పెందుర్తి: మండలంలోని పినగాడి శివారు ఓ చెరువులో నిర్వహిస్తున్న బల్లాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. 25 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.1.24 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి..పినగాడి శివారులో గురువారం సాయంత్రం గుట్టు చప్పుడు కాకుండా బల్లాట జరుగుతుంది. దీనిపై పక్కా సమచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. నిర్వాహకులతో పాటు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గర్భిణులకు ఉన్నత వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. నెలల నిండిన గర్భిణులను ముందస్తుగా బర్త్ వెయిటింగ్ హాళ్లకు తరలిస్తుండటంతో మాతాశిశు మరణాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లావ్యాప్తంగా రోజుకు సుమారు వంద వరకు సుఖ ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుండటంతో మన్యంలో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటోంది.

- ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు
- నెలలు నిండిన గర్భిణులను ముందుగా తరలింపు
- బాసటగా నిలుస్తున్న బర్త్ వెయింటింగ్ హాళ్లు
- అందుబాటులో ఉన్నత వైద్యం
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గిరిజన ప్రాంతాల్లో తల్లీబిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. హోం డెలివరీలను పూర్తిగా అరికట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నెలలు నిండిన గర్భిణులను ముందస్తుగానే దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించేలా చర్యలు చేపట్టింది. అక్కడ వైద్యపరీక్షలు అనంతరం అత్యవసరమైతే జిల్లాలోని రిఫరల్ ఆస్పత్రులకు తరలించి కాన్పులను విజయవంతంగా నిర్వహిస్తోంది.

మాతాశిశు మరణాల నివారణ లక్ష్యంగా..

గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాల నిర్మూలనే లక్ష్యంగా శిశు జనన నిరీక్షణ కేంద్రాల(బర్త్ వెయిటింగ్ హాల్)ను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలోని 22 మండలాల్లో 46 కేంద్రాలను ఏర్పాటుచేసి ఉన్నత వైద్యసేవలను చేరువచేసింది.

- గతంలో గర్భిణుల హైరిస్క్ కేసులను పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం ఏరియా ఆస్పత్రులకు తరలించి సుఖ ప్రసవాలు చేసేవారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటుచేసిన బర్త్ వెయిటింగ్ హాళ్లకు ముందుగానే తరలించేలా చర్యలు చేపట్టింది. సుఖ ప్రసవం జరిగి తల్లీబిడ్డలను క్షేమంగా ఇళ్లకు తరలించే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంది. వీటి ద్వారా రోజుకు వంద వరకు సుఖ ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యారోగ్యశాఖ తెలిపింది.
- పాడేరు జిల్లా ఆస్పత్రిలో గర్భిణుల కోసం 50 పడకలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రసూతి వైద్య నిపుణులను నియమించడంతో గర్భిణులకు అత్యవసర వైద్యం అందుతోంది. కేజీహెచ్‌కు రిఫర్ కేసులు తగ్గాయి.
- అరకులోయ, చింతపల్లి, రంపచోడవరంలో పది పడకలు గర్భిణులకు కేటాయించారు. ముంచంగిపుట్టు, కూనవరం, చింతూరు. వై.రామవరం, అడ్డతీగల కమ్యూనిటీ ఆస్పత్రులతో పాటు మిగిలిన 38 పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ రూమ్‌లు ఉన్నాయి. ప్రసవం అనంతరం పూర్తిగా కోలుకున్న తరువాత తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో వారిని స్వగ్రామాలకు సురక్షితంగా తరలిస్తున్నారు. ఆ తరువాత నుంచి గ్రామాల్లోని వైద్యబృందాలు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. అంగన్‌వాడీ సిబ్బంది తల్లీబిడ్డలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

మండలాలు	:	22
బర్త్ వెయిటింగ్ హాళ్లు	:	46
ప్రసవాల సంఖ్య (రోజుకు)	:	100



అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి బర్త్ వెయిటింగ్ హాల్‌లో గర్భిణులు, బాలింతలు

సౌకర్యాలు బాగున్నాయి



అరకులోయ ఏరియా ఆస్పత్రిలోని బర్త్ వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాలు బాగున్నాయి.ఆరు రోజుల క్రితం ఇక్కడ చేరాను. వైద్యులు పరీక్షలు అనంతరం ఇక్కడే విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల క్రితం ప్రసవమైంది. తల్లీబిడ్డలం క్షేమంగా ఉన్నాం. వైద్యంతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. దీనివల్ల ఆరోగ్యం మెరుగుపడుతోంది.

– దివ్య, బాలింత, అరకులోయ

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వల్ల ప్రయోజనాలపై గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. వారికి నెలలు నిండగానే సమీప ఆస్పత్రులు, బర్త్ వెయిటింగ్ హాళ్లకు వారిని అంబులెన్సులో తరలిస్తున్నాం. గిరి శిఖర గ్రామాల్లోని గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటికి చేర్చుతున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన స్కూటీ

యలమంచిలి రూరల్ : రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన యలమంచిలి మండలం పోతురెడ్డిపాలెం వద్ద గురువారం రాత్రి జరిగింది. పోతురెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇత్తంశెట్టి అప్పలనాయుడు గ్రామం సమీపంలో హైవే కూడలి వద్ద బైక్‌తో రోడ్డు దాటుతున్న సమయంలో తుని నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖ నగరానికి చెందిన యువకులు వై. ప్రవీణ్, పి.చైతన్య, పోతురెడ్డిపాలెం గ్రామానికి చెందిన అప్పలనాయుడు గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే హైవే నిర్వహణ సంస్థకు చెందిన 1033 అంబులెన్సు సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి గాయపడిన ముగ్గుర్నీ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ రవిచంద్ర క్షతగాత్రులకు చికిత్స అందజేశారు.

బతికి సాధించు

వలలో చిక్కుకున్న చేపపిల్ల చివరి నిమిషం దాకా తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. చిరుతపులి కూడా ఒంటినిండా తూటాలతోనే వేటగాడికి ఎదురొడ్డి నిలుస్తుంది. ఆకతాయి కుర్రాళ్లు కసిదీరా నలిపేసిన సీతాకోకచిలుక అయినా తెగిన రెక్కలతోనే మొండిగా ఎగరాలని చూస్తుంది. సృష్టిలో ఏ జీవికీ ఆత్మహత్య ఆలోచన రాదు – ఒక్క మనిషికే ఆ విపరీత బుద్ధి! చిన్న సమస్య రాగానే తల్లడిల్లిపోతాడు. చావే నయమన్న భ్రమలో పడిపోతాడు.జీవితంలో వెనక్కి తీసుకోలేనివి రెండే.. ఒకటి కాలం.. మరొకటి ప్రాణం. తొందరపాటు జీవితాన్ని చిదిమేస్తుంది. మనపై ప్రేమను పెంచుకున్న కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిలిస్తుంది. గెలవడం ధ్యేయం కావాలి.. కానీ గెలుపే జీవితం కాదు. ఓడినంత మాత్రాన జీవితం వృథా అనుకుంటే భవిష్యత్తు శూన్యంలా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసానికి మించిన విజయం లేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితం విలువ తెలుస్తుంది. – విశాఖ విద్య



వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

- క్షణికావేశంలో ఆత్మహత్యలు వద్దు
- ఫెయిలవుతామనే ఆందోళనతో ఆత్మహత్య
- పరీక్షలు కాదు, ప్రాణాలు ముఖ్యమంటున్న తల్లిదండ్రులు
- నేడు ఇంటర్మీడియెట్ ఫలితాలు
- విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేలా ఇంటర్ బోర్డు కార్యాచరణ

మధురవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో చదువుతున్న కృష్ణ తేజ క్లాస్‌లో టాపర్. విజయనగరంలో హోటల్ నిర్వహణతో వచ్చే ఆదాయమే కుటుంబ జీవనాధారమైనప్పటికీ, కుమారుడిని ప్రయోజకుడిగా చేయాలనే గంపెడాశతో చదివిస్తున్నారు. కానీ, పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేనేమోననే ఆందోళనతో కృష్ణ తేజ ఆత్మహత్యకు ఒడిగట్టాడు. చేతికందొస్తాడుకున్న కొడుకు కళ్లముందు శవమై కనిపించడంతో తల్లి నాగలక్ష్మి కోమాలోకి వెళ్లింది. ఊహించని రీతిలో జరిగిన పరిణామాలతో తండ్రి వెంకటరమణ పరిస్థితి దయనీయంగా మారింది. క్షణికావేశంతో కృష్ణ తేజ చేసిన నిర్వాకం తల్లిదండ్రులకు శాపమైంది. చివరకు ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది.

చదువుల్లో రాణించలేకపోతున్నామని, పరీక్షల్లో ఫెయిలయ్యామనే ఆత్మన్యూనతా భావంతో కొంతమంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. '2023–24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య' చేసుకున్నారు. కారణాలేమైనా, ఇలాంటి సంఘటనలన్నీ కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లోనే చోటుచేసుకుం టున్నాయి. చదువుల ఒత్తిడి తట్టులేక క్షణికావేశంలోవిద్యార్థులు తీసుకునే నిర్ణయాలతో తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, తోబుట్టువులు ఏమైపోతారనే ఆలోచన చేయడం లేదు. ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టేలాని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు కార్యాచరణకు దిగారు. ఫలితాలు ప్రకటిస్తున్నందున, మరింత అప్రమత్తమయ్యేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

హలో స్టూడెంట్ ఎలా ఉన్నావ్..

ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసే క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇప్పటికే నియమితులైన ఐదుగురు సభ్యుల కమిటీ అప్రమత్తమయ్యేలా ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. పరీక్ష ఫలితాలు విడుదలైన రోజు నుంచే విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకునేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మేరకు కాలేజీలోని తరగతి లేదా సెక్షన్ వారీగా ఇంచార్జిగా వ్యవహరించే అధ్యాపకుడు విద్యార్థులందరినీ ఫోన్‌ద్వారా పరామర్శించనున్నారు. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు కాలేజీలో అందుబాటులో ఉన్నందున, పరీక్షల ఫలితాలు గురించి తెలుసుకోవటంతో పాటు, భవిష్యత్ చదువులపై వారికి అవగాహన కల్పించనున్నారు.

కాలేజీల్లో కౌన్సిలర్లు

2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలన్నింటిలో తప్పనిసరిగా ఒక కౌన్సిలర్లు నియమించాలని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రిన్సిపాల్ టీమ్ లీడర్‌గా ఇద్దరు లెక్చరర్లు, కాలేజీ డవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు, ఒక విద్యార్థితో కూడిన కమిటీ ప్రతీ కాలేజీలో ఏర్పాటు చేయనున్నారు. ఒక సీనియర్ లెక్చరర్‌ను కౌన్సిలర్‌గా నియమించాల్సి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇలా ఎంపిక చేసిన కౌన్సిలర్లకు ఫిబ్రవరిలోవిశాఖ కేంద్రంగా వారం రోజులు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేలా కౌన్సిలర్లు ప్రత్యేక బాధ్యత తీసుకోనున్నారు.

అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలి



ఫలితాలు ఎలా వచ్చినా, విద్యార్థులు మనోస్థైర్యం కోల్పోవద్దు. పరీక్షలు కాదు, ప్రాణాలు ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఒకసారి తప్పినా, ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో కౌన్సిలర్లను ఏర్పాటు చేశాం. వీరికి శిక్షణ కూడా ఇచ్చాం. విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కమిటీలు కూడా పనిచేయనున్నాయి.

– పి. మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

జగనన్నను మళ్లీ సీఎంను చేస్తే

మరింత అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

అనంతగిరి : గిరిజన ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్నను చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని, జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో గురుగుబిల్లి, గుమ్మకోట, భీంపోల్, రొంపల్లి పంచాయతీల గిరిజనులతో గురువారం సమావేశం నిర్వహించారు. ముందుగా భీంపోల్ పంచాయతీ చీమిడిపల్లి, సీతపాడు, భీమవరం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు నియోజకవర్గ పరిశీలికులు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శోభ హైమవతి, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణిలకు ఆయా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గుమ్మకోట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ తమను గెలిపిస్తే నాన్ షెడ్యూల్డ్ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. 90శాతం గిరిజనులున్నా, నాన్ షెడ్యూల్డ్ పంచాయతీలు కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషిచేశారని, దీనిని మరిచిపోకుండా గిరిజనులంతా ఎంపీ అభ్యర్థి గుమ్మడి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని, జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీటీసీ తవిటినాయుడు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ కిల్లో రాజారమేష్, రొంపల్లి సర్పంచ్ చిరంజీవి, నాయకులు శెట్టి అప్పలు, గాసీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

భారీగా చోరీ సొత్తు స్వాధీనం

- విశాఖ నగరంలో మార్చి నెలలో 86 చోరీ కేసుల నమోదు
- రూ.70.66 లక్షలు సొత్తు చోరీ
- 57 కేసులను ఛేదించిన పోలీసులు
- రూ.11.34 లక్షలు నగదు, 450 గ్రాముల బంగారం, 18 బైకుల స్వాధీనం
- రూ.1.12 కోట్లు విలువ చేసే 2,160 మొబైల్స్ రికవరీ
- మీడియాతో డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం



రికవరీ చేసిన మొబైల్స్, వాటిని తీసుకొనేందుకు వచ్చిన ఫిర్యాదుదారులు

విశాఖ సిటీ: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో నగరంలో 86 చోరీ కేసులు నమోదు కాగా.. వాటిలో 57 కేసులను ఛేదించినట్లు డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మార్చి నెలలో మొత్తం రూ.70,66,680 విలువైన బంగారం, వెండి, బైకులు, వాహనాలు, మొబైల్స్ చోరీకి గురయ్యాయని పలు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. వీటిపై దర్యాప్తునకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సీపీ ఫకీరప్ప పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాంకేతిక సహాయంతో అన్ని కోణాలలో దర్యాప్తు చేపట్టి 52 కేసులను ఛేదించి 57 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.11.34 లక్షల నగదు, 450 గ్రాముల బంగారం, 99 గ్రాముల వెండి, ఒక టాటా ఏస్ వ్యాన్, 18 బైక్‌లు, మూడు కంటైనర్లు, 8 బ్యాటరీలు, 11 మొబైల్స్ ఇలా మొత్తంగా రూ.37,77,950 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఇప్పటి వరకు రూ.1.12 కోట్లు విలువ చేసే 2160 మొబైల్స్‌ను రికవరీ చేసినట్లు తెలిపారు. వీటిలో 1412 మొబైల్స్ ఫిర్యాదుదారులకు అప్పగించామన్నారు. నగరంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఒకవైపు నేరాలు జరుగుతున్న తీరు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 292 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే మరోవైపు నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే హిస్టరీ షీట్ కలిగిన ఉన్న 59 మందిని బైండోవర్ చేశామన్నారు.

గుమ్మడిగొండలో 1800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

నాతవరం: వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేసి, సారా విక్రేతను అరెస్టు చేయడంతో పాటు 1,800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్ఐ రామారావు గురువారం తెలిపారు. మండలంలో మాధవనగరం గ్రామానికి చెందిన కట్టా అచ్చియ్యమ్మ ఇంటి వద్దే సారా విక్రయిస్తుండగా పట్టుబడిందన్నారు. ఆమె నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. గుమ్మడిగొండ సమీపంలో తాండవ నదీ ఒడ్డున సారా బట్టీలపై దాడులు నిర్వహించామన్నారు. తయారుదారులు పరారీ కాగా, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘనంగా లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరిదేవి ఆరాధన పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. లలితాంబిక అమ్మవారు సకల జ్ఞాన స్వరూపిణి అయిన శ్రీ శారదా పరమేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు.పురాణ,ఇతిహాస,వేద,ఉపనిశత్తుల వంటి సకల శాస్త్రాల మూల విద్యకు జ్ఞాన స్వరూపిణిగా శారదా పరమేశ్వరిని కొలుస్తారు.అమ్మవారు కమండలం,జపమాల,పుస్తకం,బ్రహ్మ ముద్ర ధరిణిగా దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారి దర్శించుకుంటే విద్యాభివృద్ధి,ఐశ్వర్య కటాక్షం లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.యాగశాలలో నిర్వహించిన లలితాంబికా సహిత సరస్వతీ హోమంలో రష్యా నుంచి వచ్చిన సాధకుడు మేక్స్ పాల్గొన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా అన్నప్రసాదాలు అందించారు. నాలుగో రోజు లలితాంబిక అమ్మవారు అన్నపూర్ణేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు గురుమాత తెలిపారు.



శారదా పరమేశ్వరిగా లలితాంబిక అమ్మవారు

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

276 కిలోల గంజాయి పట్టివేత

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారయ్యారని రూరల్ సీఐ హరి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వివరించారు. ముందస్తు సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ భీమరాజు సిబ్బందితో నెల్లిమెట్ట మట్టిరోడ్డులో మాటు వేయగా ఆటోలో గంజాయి తీసుకువస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి ఆటో దిగి పారిపోతుండగా పట్టుకున్నారు. ఆటోకు పైలెట్‌గా వ్యవహరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోలో లభించిన 276 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆటోను, బైక్‌ను, నిందితుల వద్ద ఏడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులు బి.కె.రాముడు, తునికి చెందిన ఎ.బాబ్జీ, ఎ.శ్రీను, ఆర్. నరసింహమూర్తిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఇచ్చిన సమాచారంతో పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

15కేజీల గంజాయితో ఇద్దరి అరెస్టు

రావికమతం : బైక్‌పై తరలిస్తున్న 15 కేజీల గంజాయిని పట్టుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు గురువారం తెలిపారు. రావికమతం ఎస్ఐ ధనంజయనాయుడు, సిబ్బందితో కలిసి రావికమతం బస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నంద్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై 15 కేజీల గంజాయితో వెళ్తూ పట్టుబడ్డారన్నారు. వీరు ఒడిశా సరిహద్దులో గంజాయిని కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారని చెప్పారు.

వైజాగ్‌కు

ది వరల్డ్



ద వరల్డ్ క్రూయిజ్ షిప్

- ఏప్రిల్ 29న రానున్న ఇంటర్నేషనల్ క్రూయిజ్ షిప్
- విశాఖ నుంచి చెన్నై మీదుగా పోర్టుబ్లెయిర్‌కు పయనం
- ఆగస్టులో కార్డిలియా క్రూయిజ్ రాక

సాక్షి, విశాఖపట్నం: విహార ప్రపంచానికి విశాఖ మరోసారి ముహూర్తం సిద్ధం చేసుకుంది. విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)లో నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ నుంచి మొట్టమొదటి క్రూయిజ్ సర్వీసు ప్రారంభంకానుంది. విశాఖ నుంచి చెన్నై మీదుగా పోర్టు బ్లెయిర్‌కు సర్వీసు నడిపేందుకు 'ది వరల్డ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్' సిద్ధమవుతోంది. ఏప్రిల్ 29న ఈ ఇంటర్‌నేషనల్ క్రూయిజ్ షిప్ విశాఖ చేరుకోనుంది. రేట్లు, బెర్తింగ్ టైమ్స్ తదితర అంశాలపై చర్చించేందుకు త్వరలో విశాఖ పోర్టుకు 'ది వరల్డ్' సంస్థ ప్రతినిధులు రానున్నారు.

70 మంది ప్రయాణికులతో 'ది వరల్డ్'

మొత్తం 11 అంతస్తుల క్రూయిజ్ షిప్ 'ది వరల్డ్' ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 8 గంటలకు విశాఖ పోర్టుకు చేరుకోనుంది. ఈ షిప్‌లో 300 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. మొత్తం 70 మంది విదేశీ ప్రయాణికులతో విశాఖ చేరుకోనుంది. విశాఖ పోర్టు నుంచి 30వ తేదీ సాయంత్రం 4 గంటలకు బయలుదేరనుంది. చెన్నైకు రెండు రోజుల్లో చేరుకొని.. అక్కడి నుంచి పోర్టు బ్లెయిర్‌కు మరో మూడు రోజుల్లో చేరుకునేలా ఈ సర్వీసును నడుపుతున్నారు. ఇక షిప్‌లో అత్యాధునిక సౌకర్యాలతో పాటు ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్, షాపింగ్ మాల్స్, లైవ్‌షోలు ఉంటాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు.

ఆగస్టులో కార్డిలియో సర్వీసులు..

మరోవైపు.. గతంలో ఇక్కడి నుంచి ఆరు నెలల పాటు చెన్నైకు సర్వీసులు నడిపించిన ఎంప్రెస్ సంస్థకు చెందిన కార్డిలియో క్రూయిజ్ షిప్.. మరోసారి పర్యాటకులకు కనువిందు చేయనుంది. ఈ షిప్ ఆగస్టు నుంచి సర్వీసులు నడపనుంది. ప్రతి మూడు రోజులకోసారి రోజు విడిచి రోజు నడిపించేలా పోర్టు అధికారులు బెర్తులు అందించనున్నారు. ఈ క్రూయిజ్.. 3 నెలల పాటు విశాఖ నుంచి సర్వీసులు నడపనున్నట్లు పోర్టు వర్గాలు వెల్లడించాయి.

టెర్మినల్‌కు తొలి క్రూయిజ్ రాక

తూర్పు తీరంలోని తొలి క్రూయిజ్ టెర్మినల్‌ని గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించారు. రూ.96.05 కోట్లతో క్రూయిజ్ బెర్త్, టెర్మినల్ బిల్డింగ్ నిర్మించారు. నిర్మాణ పనుల్ని ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు. ప్రపంచ పర్యాటకులు క్రూయిజ్‌లో వచ్చి.. విశాఖ మహా నగరంలో పర్యటించే విధంగా వివిధ ఏర్పాట్లు చేశారు. 2500 చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు విదేశీ యాత్రికులకు కావాల్సిన సకల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలిసారిగా ఈ టెర్మినల్‌కు క్రూయిజ్ సర్వీసు రానుండటంతో.. ఏర్పాట్లపై పోర్టు అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు ప్రారంభించారు.



విశాఖలోని క్రూయిజ్ టెర్మినల్